## క్లుప్తంగా

### రాజన్న ఆటోనగర్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి, ఖాజావలీ

జగదాంబ : రాజన్న ఆటోనగర్ ప్రారంభోత్సం నిమిత్తం వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ వై.వీ. సుబ్బారెడ్డికి జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, యూనియన్ ప్రెసిడెంట్ పటాన్ ఖాజావలీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజన్న ఆటోనగర్‌కు సంబంధించి అనందపురంలో ప్రభుత్వం 155.77 ఎకరాల భూమి ఇచ్చిందన్నారు. దీనికి కావల్సిన నిధులు కూడా జగనన్న ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో ప్రారంభోత్సం చేయించాలని కోరారు. ఆటోనగర్ ప్రారంభం అయితే 2500 మంది స్క్రాప్ వ్యాపారులు, 7500 మంది వర్కర్ల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్‌కు సత్కారం



ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్ : అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం గత 30 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌ని ఘనంగా సత్కరించారు. మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో టాలెంట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నృత్య కళాకారుడు నటరాజ పరమేశ్వరన్ మాట్లాడుతూ భారతదేశ సంస్కృతిలో భాగమైన కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఎండీ తాజ్, పార్థసారథి, చింతా ప్రభాకరరావు, మహ్మద్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల సందడి



సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్ : సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1988 పదో తరగతి బ్యాచ్) ఆదివారం సందడి చేశారు. విశాఖతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, వివిధ రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ముడసర్లోవలో కలుసుకుని ఎంజాయ్ చేశారు.

### అంగన్‌వాడీల విన్నూత నిరసన

సీతమ్మధార : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్న నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఒంటి కాలిమీద నిలబడి విన్నూత నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వై.తులసి, ఇందిర, ఈశ్వరమ్మ, రత్నం, వెంకటలక్ష్మి, ఆయాలు పాల్గొన్నారు.

### 'పక్కాగా సినిమాటోగ్రఫీ చట్టం అమలు చేయాలి'

మద్దిలపాలెం: నగరంలో సినిమాటోగ్రఫీ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సెన్సార్ బోర్డు సలహా మండలి పూర్వ సభ్యుడు నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో కోరారు. 1952 సెక్షన్ 4 నుంచి 7, 12, 13 ప్రకారం ఏ–సర్టిఫికెట్ పొందిన చిత్రాలను నగరంలో కొన్ని థియేటర్లలో ప్రదర్శిస్తున్నారన్నారు. అటువంటి సినిమాలకు 18 ఏళ్లలోపు బాలలకు అనుమతి లేదని తెలిపారు.



ఇది కదా అభివృద్ధి

# ఘాట్‌రోడ్డుకు లైన్ క్లియర్

పేద, మధ్య తరగతి ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఆరోగ్యకర పరిసరాల కల్పనకు వెనుకాడకుండా నిధులు వెచ్చిస్తోంది. తాజాగా అన్నవరం పుణ్యక్షేత్రంతో సమానంగా పేరొందిన ఇసుకకొండ (బాబాజీ) కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి చేరుకోవటానికి గల మార్గం విస్తరణకు పనులు మొదలుపెట్టింది. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- ఇక సులువుగా ఇసుకకొండ బాబాజీ దర్శనం
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: నిత్యం ఒత్తిడి ఎదుర్కొనే వారు మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక కేంద్రాలు.. ఆలయాలకు వెళ్తుంటారు. కొద్ది సేపు ఆలయంలో గడిపి.. తిరిగి వారి వారి విధుల్లో నిమగ్నమవుతుంటారు. అలాంటి ప్రశాంత వాతావరణం మరికొద్ది రోజుల్లో నగరంలోని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నెలకొననుంది.

వివరాల్లోకి వెళ్తే.. అన్నవరం పుణ్యక్షేత్రం అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం. ఈ దేవాలయానికి జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అనేక మంది భక్తులు వస్తుంటారు. ప్రత్యేకంగా పౌర్ణమి రోజున వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ఇంతటి ప్రాచుర్యం పొందిన సత్యదేవుని ఆలయానికి సరైన మార్గం లేక భక్తులు అవస్థలు పడేవారు. దాదాపు రెండేళ్లకు పైగా సాగిన ఘాట్‌రోడ్డు పనులు అనివార్య కారణాల వల్ల చాలా కాలంగా నిలిచిపోయాయి. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే ఇసుకకొండ ఘాట్‌రోడ్డుకు ఇంత వరకు పూర్ణామార్కెట్ దయారామ్ స్వీట్ స్టాల్ వద్ద అడ్డంకిగా ఉన్న నిర్మాణాలు తొలగించారు. కేవలం 25 నుంచి 50 మీటర్ల ఘాట్‌రోడ్డు పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం అక్కడి నిర్మాణాలు తొలగించడంతో ఘాట్‌రోడ్డు పనులకు లైన్ క్లియర్ అయినట్టయింది.



అర్థంతరంగా నిలిచిపోయిన ఘాట్‌రోడ్డు పనులు



ఘాట్‌రోడ్డుకి అడ్డంకిగా ఉన్న నిర్మాణాలు



బాబాజీకొండ ఘాట్‌రోడ్డు

**అసాంఘిక కార్యక్రమాలకు చెక్..**

సాయంత్రం 5 గంటలైతే చాలు.. ఓ వైపు మందుబాబులు.. మరోవైపు ప్రేమికుల జంటలు ఈ ప్రాంతానికి చేరుకుని నచ్చినట్లు ప్రవరిస్తుండటంతో స్థానికులు, భక్తులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఘాట్‌రోడ్డుకు లైన్ క్లియర్ కావడంతో ఇటువంటి వాటికి చెక్ పడినట్టే.

**ఇక కష్టాలు తీరినట్టే..**

ఘాట్‌రోడ్డు పనులు పూర్తయి రోడ్డు అందుబాటులోకి వస్తే నిత్యం వాహనాల రాకపోకలు సాగుతాయి. అంతే కాకుండా కేజీహెచ్ మార్చురీని దాటుకుంటూ సత్యదేవుని దర్శనానికి వెళ్లే భక్తుల బాధలు కూడా తొలగినట్లే. అలాగే ఏవీఎన్ కళాశాల వైపు ఉన్న ఏఎంసీ గేట్ కూడా కొంత ఇబ్బందిగా ఉండేది. ఇటువంటి ఇబ్బందుల నుంచి భక్తులకు ఉపశమనం కలగనుంది. ఘాట్‌రోడ్డు పనుల అంశం ఇటీవల ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**దశాబ్దాల కల నెరవేరబోతోంది..**



ఘాట్ రోడ్డు ప్రారంభమైతే భక్తుల కష్టాలు తీరినట్టే. ఇక నుంచి సులువుగా స్వామి దర్శనం అవుతుంది. అలాగే భక్తుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇంత వరకు సజావుగా రోడ్డు మార్గం లేక కొంత మంది భక్తులు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు.

సీహెచ్ రాజేశ్వరి, భక్తురాలు

**భక్తుల కష్టాలు తీరనున్నాయి..**



సత్యదేవుని భక్తుల కష్టాలు తీరనున్నాయి. అన్నవరం సత్యదేవుని అంతటి ప్రాచుర్యం గల ఇసుకకొండ(బాబాజీకొండ) సత్యదేవుని ఆలయానికి రావాలంటే అవస్థలు పడేవారు. సరైన రోడ్డు మార్గం లేక, కేజీహెచ్ మార్చురీ మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఇక నుంచి భక్తుల కష్టాలు తీరనున్నాయి.

లీలావతి, భక్తురాలు

## ఘనంగా హనుమత్ వ్రతం



ప్రత్యేక అలంకరణలో శ్రీ ఆంజనేయస్వామి వారు

మహారాణిపేట : మెయిన్‌రోడ్డులోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, తమలపాకుల పూజ, సింధూర పూజ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. ముందుగా ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ సంప్రదాయ రీతిలో ఉత్సవ మూర్తికి అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. హనుమత్ వ్రతం ఆచరించి ధూప, దీప, నైవేద్యాలు, మంత్రపుష్పాలు సమర్పించారు. స్వామి వారికి నీరాజన నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఏర్పాట్లు పర్యవేక్షించారు. సాయంత్రం ఆల్ ఇండియా రేడియా ఆర్టిస్టు కొండూరి గాయిత్రి భక్తిరంజని కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వడ్డాది దీలిప్‌కుమార్ స్వాగతం పలికారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఆడపా శివ, బత్తుల రాము, గుర్తి రత్నం, యలమంచిలి సంతోష్‌కుమార్, పొన్నాడ శారద, భోను కళ్యాణి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



కొబ్బరితోటకు చెందిన వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి

అల్లిపురం : ప్రజాదర్బార్‌లో ఆర్థిక సహాయం కోరిన మేరకు 12 మంది రోగులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం రూ.65 వేలు ఆర్థిక సహకారం అందజేసి ఆదుకున్నారు. 37వ వార్డు జాలరిపేటకు చెందిన మట్టా రాజుకు రూ.10 వేలు, 29వ వార్డు భుజంగరావుపేటకు చెందిన మాతా క్రిస్టియన్ చర్చికి రూ.5 వేలు, 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట ప్రాంతానికి చెందిన విజయకు రూ.5 వేలు, 34వ వార్డుకు చెందిన గరికిన నరసింహులకు రూ.5 వేలు, ఎం.పేంతమ్మకు రూ.5 వేలు, కొబ్బరితోట ప్రాంతానికి చెందిన చింతకాయల ఎర్రమ్మకు, 29వ వార్డుకు చెందిన ఎం.ఆదిలక్ష్మికి, రామజోగిపేటకు చెందిన కె.వెంకటప్పారావుకు, 30వ వార్డుకు చెందిన బొడ్డు దేవికి రూ.500 చొప్పున.. పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఆత్మీయతతో పలకరించి ఆదుకున్న ఎమ్మెల్యే 2024 ఎన్నికల్లో గెలుస్తారని అన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు స్టేట్ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు హ్యాపీ ఫీట్ ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మహారాణిపేట : లీ హెల్త్ డొమైన్ జేసీఐ వైజాగ్ స్టీల్ సిటీ, థింక్ హ్యాంగర్ సహకారంతో నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ప్రాజెక్టు హ్యాపీ ఫీట్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో లోగో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. లీ హెల్త్ డొమైన్ అండ్ లీ ఫార్మా లిమిటెడ్ డైరెక్టర్ లీలా రాణి అల్లా, కన్సలెంట్ డెర్మటాలజిస్టు అండ్ థింక్ హ్యాంగర్ డాక్టర్ గోపిచంద్, వైజాగ్ స్టీల్ సిటీ జేసీ జయలక్ష్మి, జేసీ సరోజని ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి





రోలాండ్ విలియమ్స్‌ను సత్కరిస్తున్న అధ్యక్షుడు రవీంద్ర

బీచ్ రోడ్డు: ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తమ విస్తృత సేవా కార్యక్రమాల ద్వారా ఆధునిక సమాజ నిర్మాణ దిశా నిర్దేశకులుగా వాకర్స్ ఎదగాలని అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర పిలుపునిచ్చారు. బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ మహా సమ్మేళనం ముగింపు సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా దేశం నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. 2 వేల మంది ప్రతినిధులతో 2 రోజుల పాటు ఘనంగా నిర్వహించామన్నారు. ముగింపులో భాగంగా వాకర్స్ క్లబ్ అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్కే బీచ్ వద్ద నడక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కన్వెన్షన్ చైర్మన్ రోలాండ్ విలియమ్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమల్ బైడ్, ఎ.ఎస్.ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతోనే పెన్షన్ సాధన

మర్రిపాలెం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు రోడ్డున పడుతున్నారని హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ మసేను అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన ఆదివారం మాధవధార తోటల్లో సర్వసభ్య సమావేశం, వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్టు బెర్తులను ముక్కలుగా చేసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యోచిస్తోందని, తక్షణమే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసికట్టుగా ఉంటేనే పెన్షన్‌ను సాధించుకోవచ్చన్నారు. అసోసియేషన్ చైర్మన్ సనపల బంగారురాజు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు.

# క్రిస్మస్ శోభ



31వ వార్డు వేడుకల్లో పాల్గొన్న బాపూ ఆనంద్, పాస్టర్లు దేవప్రసాద్, ఇమ్మాన్యుయేల్

అల్లిపురం : జీవీఎంసీ 31వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు దేవప్రసాద్, ఇమ్మాన్యుయేల్ పాల్గొని 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ విజయం సాధించాలని, ఈసారి మంత్రి పదవి పొందాలని ప్రార్థన నిర్వహించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి, ఆశీర్వచనాలు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు అధ్యక్షుడు పెంటకోట రాజు, రాంబాబు, కొండ భవానీ, ధోనీ పిలక మోహన్, గంట శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**జ్ఞానాపురంలో..**

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ కేక్ కట్ చేశారు. కార్యకర్తలు, నాయకులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. మహిళలు, ఆర్పీలకు చీరలు పంపిణీ చేశారు. ముందుగా వార్డు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పరమాత్ముడు దివి నుండి భువికి దిగివచ్చిన వేళ క్రిస్మస్ అని, ఆయన జీవనశైలి మార్గదర్శకం అన్నారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వేశంగిణీరావు, కుమార్, కల్యాణ్, అన్నపూర్ణ, దేవి, దమర్సింగ్, శ్రీను, రాజా, చుక్క శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

**కారుచీకట్లో కాంతి రేఖలా క్రీస్తు జననం..**

ఏసు ప్రపంచానికి వెలుగు ప్రసాదించే ప్రభువని, అంధకారంలో నడిచే వారికి కాంతిరేఖగా నిలుస్తారని రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. క్రీస్తు ప్రవచించిన సర్వమానవ సమానత్వాన్ని అందరూ అలవర్చుకోవాలని ఉద్బోధించారు. అంతకు ముందు దివ్య బలిపూజ సమర్పణ, ప్రత్యేక ప్రార్థనలు, క్రిస్మస్ కేరల్స్, ఆధ్యాత్మిక ప్రసంగాలు, దైవ సందేశం, క్రిస్మస్ పాటలు, నృత్యాలు, సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం క్రీస్తు జన్మించిన పశువుల పాకను భక్తులు దర్శించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రక్షణగిరిలో జరిగే జాతరను పారిస్ పాస్టిల్ కౌన్సిల్ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం 4 గంటలకు జ్ఞానాపురంలోని పలువీధిల్లో ప్రదక్షిణలు చేశారు. కొండవీధిలో ఏర్పాటు చేసిన ప్రార్థనలో చర్చి ఫాదర్ రెవరెండ్ జాన్‌ప్రకాష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న అల్లిపురం చిన్నారులు

**కల్లుపాకలు చర్చిలో..**

జగదాంబ : ఏసుక్రీస్తు ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చారని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం వార్డులో కల్లుపాకలు చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విల్లూరి మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో అందరం నడవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పార్థన చేస్తున్న క్రైస్తవులు



ఆర్పీలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీధర్



శాంతి సందేశం ఇస్తున్న పాస్టర్ లాజరస్



విద్యుత్ అలంకరణలో పునీత పేతురు చర్చి



ప్రార్థన చేస్తున్న పార్టీ నాయకులు

## క్రికెట్, త్రోబాల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ జాన్‌ప్రకాష్, నిఖిలేష్ రాజ్‌కుమార్

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి గ్రౌండ్‌లో సెయింట్ మదర్ థెరిస్సా మెమోరియల్ స్పోర్ట్స్ టోర్నమెంట్ పేరిట వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సీనియర్ నాయకుడు యాండ్రపు నిఖిలేష్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్–త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆర్‌సీఎం విశాఖ చాన్స్‌లర్, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ పోస్టర్ ఆవిష్కరించారు. జనవరి 28 వరకు జరిగే పోటీల్లో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని సుమారు 22 చర్చిలు, 25 విద్యా సంస్థల క్రీడాకారులు పాల్గొంటారని ఫాదర్లు శివం విజయభాస్కర్, ప్రభాకర్ తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యురాలు యాండ్రపు పాతిమారాణి, సీహెచ్ విజయకుమార్, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మార్గశిర పూజలు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 11వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. టౌన్‌కొత్తరోడ్డు వరకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

**త్రికాల పంచామృతాభిషేక సేవలో..**

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అలరించిన క్లాసికల్ డ్యాన్స్**

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ డ్యాన్స్ అకాడమీకి చెందిన కె. మోహనకుమారిచే నిర్వహించిన క్లాసికల్ డ్యాన్స్ భక్తులను అలరించింది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం నగరానికి చెందిన లలిత డ్యాన్స్ అకాడమీచే కూచిపూడి నృత్యం ఏర్పాటు చేసినట్టు ఈవో శిరీష తెలిపారు.